క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా 'కొర్రపాటి'



మాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచి బీసీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మాచర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా కొర్రపాటి మల్లిఖార్జునరావుకు నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాబోయే ఎన్నికలల్లో మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలందరి అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలుకింద పడి మతిస్థిమితం లేని మహిళ మృతి



పిడుగురాళ్ల: మతిస్థిమితం లేని మహిళ రైలు కింద పడి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి జానపాడు రైల్వే గేటు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మారుతి మహాలక్ష్మి థియేటర్ వెనుక నివాసం ఉండే షేక్ హుస్సేన్‌బి (58) మతిస్థిమితం సరిగా లేక పోవడంతో గుంటూరు వైపు నుంచి మాచర్ల వెళుతున్న మాచర్ల ప్యాసింజర్ రైలు గేటు వేసి ఉందని నడుచుకుంటూ ఒక్కసారిగా రావడంతో రైలు ఢీకొని అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారాన్ని బంధువులకు తెలియజేశారు.

నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన

మాచర్ల రూరల్: గ్రామంలో అంటువ్యాధులు ప్రభలకుండా నీటి నాణ్యతను పరీక్షించి వేసవిలో వచ్చే అనారోగ్య సమస్యలను ముందుగానే పరిష్కరించుకోవచ్చునని వాటర్ ఎయిడ్ ఇండియా కో–ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని గన్నవరం గ్రామంలో నీటి నాణ్యత పరీక్షలను గ్రామ ప్రజలకు వివరిస్తూ వారు మాట్లాడారు. గ్రామాలలో తాగునీటికి వినియోగించే బోరు నీటిని నాణ్యత పరీక్షలు చేయించుకోవాలని ఈ పరీక్షల కోసం వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ సిబ్బంది తమ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే గ్రామంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్ ఎక్సర్‌సైజ్ నిర్వహించామని ఒక ఇంజన్ బోర్ వెల్, మూడు వాన నీటి పరిరక్షణ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. సీఎఫ్ రవివర్మ, లక్ష్మణరావు, వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గురజాల: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

బీజేపీవి మతోన్మాద, కార్పొరేట్ విధానాలు

నరసరావుపేట: ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం నింపి పోరాటాలకు సిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం రైతు, కార్మిక, మహిళా, విద్యార్థి యువజన ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళన సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 23న భగత్ సింగ్ వర్ధంతిని వాడవాడలా నిర్వహించి ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకులు తోట ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, గ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర రావు, నల్లపాటి రామారావు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం


ఎస్సీ కాలనీలో వేసిన సీసీరోడ్డు

మోర్జంపాడుకు మహర్దశ

ఐదేళ్లలో సుమారు రూ.50 కోట్లతో సంక్షేమాభివృద్ధి

- నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మెరుగైన అభివృద్ధి పనులు
- ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నాడు...

గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాత గ్రామ పంచాయతీ కార్యాలయం. అరకొర సౌకర్యాలు. పరిపాలనకు ఇబ్బందికర పరిస్థితులు. గ్రామంలో సరైన వైద్య సౌకర్యం ఉండేది కాదు. ఏది కావాలన్నా 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన దుస్థితి. ప్రభుత్వ సంక్షేమం కావాలంటే జన్మభూమి కమిటీల రికమండేషన్లు. పింఛన్ తీసుకోవాలన్నా నానా అవస్థలు. అభివృద్ధి పనులు సైతం అధికార టీడీపీ నేతలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే.. అధికారులను కలవాలంటే నేతలను సంప్రదించాల్సిందే. టీడీపీ నాయకుల ఆజ్ఞ లేనిదే ఏ పని జరిగేది కాదు.

నేడు...

సరికొత్త హంగులతో నిర్మించిన గ్రామ సచివాలయం ద్వారా ప్రభుత్వ అందుబాటులోకి సేవలు.. సంక్షేమానికి అర్హతే ప్రామాణికం. ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు. అందుబాటులో వైద్య సేవలు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు. ఏ పని కావాలన్నా నేరుగా అధికారులను కలిసే అవకాశం. విద్య, వైద్య, వ్యవసాయ, రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది. ఎటు చూసినా సీసీ రోడ్లు. గ్రామ నడ్డిబొడ్డున నూతన ప్రభుత్వ భవన సముదాయాలు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలలో సీసీ రోడ్లతో నూతన హంగులు, మౌలిక సదుపాయాలు.



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామ జనాభా సుమారు 9600. కుటుంబాలు సంఖ్య సుమారు 2700. వారిలో ఎస్టీలు 300 ఎస్సీలు, 230. బీసీలు 1300 కాగా మిగిలిన వారు ఓసీలు. మేజర్ గ్రామ పంచాయతీ అయినా గ్రామాభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉండేది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతాంగ సాగునీటి సమస్యను తీర్చేందుకు ఏర్పాటు చేసిన లిఫ్టు ఇరిగేషన్ పథకం, మంచి నీటి పథకాలు తప్ప గ్రామంలో చెప్పుకునే పని ఒక్కటైనా లేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. భావితరానికి గుర్తుండేలా పనులు చేపట్టారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో గ్రామంలో సుమారు రూ.50 కోట్లు సంక్షేమాభివృద్ధి జరిగింది. ఇందులో సంక్షేమానికి సుమారు రూ. 42 కోట్లు కాగా, అభివృద్ధికి సుమారు రూ.8 కోట్లు ఖర్చు చేశారు. ఇది కాదా....అభివృద్ధి అంటూ..... ప్రజలు నినదిస్తున్నారు.



గ్రామంలో సకల సౌకర్యాలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్

గ్రామంలో చేపట్టిన కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు..

గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు	రూ.2.50కోట్లు
గ్రామ సచివాలయాలు (2)	రూ. 84 లక్షలు
రైతు భరోసా కేంద్రాలు (2)	రూ. 47 లక్షలు
హెల్త్ క్లినిక్ సెంటర్లు(2)	రూ. 42 లక్షలు
నాడు–నేడు ద్వారా జడ్పీ హైస్కూల్‌కు..	రూ.1.65 కోట్లు
ఎంపీపీ స్కూల్ నకు..	రూ. 25 లక్షలు
జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన నిధులు	రూ1.20 కోట్లు
మండల పరిషత్ గ్రాంటు ద్వారా చేపట్టిన పనులు	రూ.55 లక్షలు
గ్రామ పంచాయతీ నిధుల ద్వారా చేపట్టిన పనులు	రూ.65 లక్షలు

2019 నుంచి 2023 వరకు అందించిన పథకాల్లో కొన్ని..

పథకం	నగదు పంపిణీ..
ఆసరా	రూ.3,91,01,609
అమ్మ ఒడి	రూ.3,39,05,575
పెన్షన్లు	రూ.11,05,15,500
రైతు భరోసా	రూ.5,52,93,450
వైఎస్సార్ చేయూత	రూ.1,70,81,250
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	రూ.1,90,41,893
జగనన్న విద్యాదీవెన	రూ.1,30,29,576
పంటల బీమా	రూ.1,00,22,764
ఇళ్ల పట్టాలు	202 మందికి

ప్రజలకు ఎంతో మేలు జరిగింది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎంతో మంచి జరిగింది. ఆయన సారథ్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశాం. జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయం.

– భువనగిరి కృష్ణవేణి, సర్పంచ్

కోట్లాది రూపాయలతో పనులు..



గ్రామంలో కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాం. పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇది ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితోనే సాధ్యపడింది.

– దారం లక్ష్మిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్

ప్రతి ఇంటికీ సంక్షేమం అందింది



గ్రామంలో వలంటీర్ల ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందాయి. ఎక్కడా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు ఖాతాలోకి నగదు బదిలీ అవ్వడంతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– జిలుగు వెంకట నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

పార్టీ మారకపోతే అంతు చూస్తా..!

వైఎస్సార్ సీపీ ఎస్టీ నాయకుడికి టీడీపీ నేత బెదిరింపు

పిడుగురాళ్ల: 'వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలోకి చేరాలని, లేకుంటే నీ అంతు చూస్తా... నీకున్న ఎకరన్నర పొలం లేకుండా చేస్తా'నని మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురపాటి కొండలు భయపెడుతున్నాడని అదే గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిరుమామిళ్ల ఏడుకొండలు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన కురపాటి కొండలు గతంలో వైఎస్సార్ సీపీలో ఉన్నాడని, ఇటీవలే టీడీపీలో చేరాడన్నారు. తనకు గత రెండు రోజులుగా టీడీపీలోకి రావాలని బలవంతం పెడుతుండడంతో వైఎస్సార్ సీపీని వీడి నేను రానని తేల్చి చెప్పానన్నారు. అప్పటి నుంచి తనపై కక్షసాధింపు చర్యలు చేపట్టాడన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు

మాచవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి దుస్సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కే అమీనుద్దీన్ తెలిపారు. మండలంలోని మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు, కొత్త గణేశునిపాడు గ్రామాల్లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ప్రత్యేక బలగాలతో బుధవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికల జరిపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపెట్టేవారిపై చర్యలు

మాచర్ల: ఓటర్లను ప్రలోభపెట్టే అభ్యర్థులపై పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖ అధికారులు డేగ కన్ను వేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ పీవీ రంగయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓటర్లకు పంపిణీ చేసేందుకు తాయిలాలు ఎక్కడ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు? ఎలా రవాణా చేసుకుంటున్నారు? అన్న విషయాలపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పలు పార్శిల్ సర్వీసు సంస్థలను అధికారులు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు అభ్యర్థులు దిగుమతి చేసుకొనే వస్తువుల వివరాలపై 91549 70445 నెంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారమందించాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠా మహోత్సవాలు

గురజాల: నగర పంచాయతీలోని శ్రీరాంపురంలో వేంచేసియున్న గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు, శ్రీ కనకదుర్గా అమ్మవారు శిలా జీవధ్వజ శిఖర కలశ పరివార దేవతా స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యవర్గ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా పూజలందుకున్న విగ్రహాలకు వేకువజామున సుప్రభాతసేవ, కలశ తీర్థం, ప్రాతఃకాల పూజలు, భూపూజ, ధాతున్యాస, బీజన్యాసములు, అనంతరం ధ్వజ స్తంభం ఏర్పాటు అనంతరం దేవతామూర్తుల స్థిర ప్రతిష్ఠలు, అనంతరం ధేనుదర్శన దర్శనం, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శాంతి కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునుంచి భక్తులు స్వామి వార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

పల్లెగుంతలో వినాయక దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం..

మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో వినాయక దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


గురజాలలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

దేవుని దీవెనలు అందరికీ ఉండాలి : ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దేవుని దీవెనలు ప్రతి ఒక్కరికి ఉండాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గురజాల, పల్లెగుంత గ్రామాల్లో ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, కొమ్మినేని బుజ్జి, కొమ్మినేని రవిశంకర్, పల్లెగుంత సర్పంచ్ వి.మల్లయ్య, నరేష్, తదితరులున్నారు.

వైభవంగా నాగేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ


పునః ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు

చిలకలూరిపేట: పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో పునఃనిర్మాణం చేసిన శ్రీగంగా బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులతో యంత్ర స్థాపనములు, బింబు స్థాపనములు, దిష్టికుంభం, ధేనుదర్శనములు, కళాహోమములు, పూర్ణాహుతి, అవబృధము, మహదాశీర్వచనము, శాంతి కళ్యాణం, మంగళహారతి, భక్తజనకోటి దివ్యదర్శనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ పునః నిర్మాణ కమిటీ చైర్మన్ పి.వీరనారాయణ, సభ్యులు జి.రమణమూర్తి, వి.లక్ష్మీనారాయణ, ఎల్.ఆదినారాయణరెడ్డి, పి.పూర్ణచంద్రరావు, బి.సుబ్బారావు, జి.పోలయ్య, జి నాగభూషణం, పి.శివసత్యనారాయణ, వారణాసి వెంకట సుబ్రమణ్యం దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం.సుబ్బారావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశాలు



పెదకూరపాడు: ప్రతిభ కలిగిన ప్రతి విద్యార్థికి భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ గురునాథం అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల కళాశాలను ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐటీ రంగంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ గురునాథం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత ఐటీ రంగంలో అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో విద్యార్థులకు వివరించారు. ప్రతిభకల విద్యార్థులను ఎంపిక చేసి ఆరు నుంచి 12 నెలల పాటు హెచ్‌సీఎల్ కంపెనీ శిక్షణ ఇస్తుందని తెలిపారు. శిక్షణ కాలంలోనే ప్రతినెలా రూ. 10 వేలు స్టయిఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రూ. 2.20 లక్షల వార్షిక వేతనం ఇస్తామన్నారు. ఒక పక్క జాబ్ చేస్తూ చదువులో రాణించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పీజీటీలు బాజీఖాన్, అజిత, రమణ, మూర్తి, ఏసుబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్వో శ్రీరాములు

పెదకూరపాడు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు అన్నారు. పెదకూరపాడులోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు అవగాహన సదస్సు జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ఓటు విలువ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయబెన్నిబాబు, కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ సాంబశివరావు, సామాజిక విశ్లేషకులు రాయపూడి సాంబశివరావు, జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్ వి.అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయాల ప్రతిష్ఠలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం వి.అప్పాపురం గ్రామంలో శ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే దేవాలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రమ్మనాయుడు వీరబ్రహ్మేంద్రస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బెహరావారిపాలెంలో..

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల శివారు బెహరావారిపాలెం గ్రామంలో బుధవారం శ్రీ కోదండరామస్వామి ఆలయ విగ్రహ ధ్వజ ప్రతిష్ఠ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం ఉదయం 10.26 నిమిషాలకు పుష్యమి నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాంశంలో విగ్రహ, ధ్వజ కలశాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని బెహరావారి పాలెం గ్రామం బంధు మిత్రులతో తీరునాళ్ల వాతావరణం నెలకొంది.

కొత్తసాలన ఆలయ వార్షికోత్సవం ..

యడ్లపాడు: మండలంలోని కొత్త సాలస గ్రామంలో వేంచేసి ఉన్న గణపతి దత్తాత్రేయ సమేత శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయ 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వేకువ జామునుంచే ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు మొదలయ్యాయి. బాబావారికి కాగడా హారతి, విష్వక్సేన పూజ, పుణ్యాహచనం, బాబా వారికి భక్తులచే పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, సాయిచాలీసా, మధ్యాహ్న హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిలారు కుప్పుస్వామి, గ్రామప్రజల సహకారంతో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు, అన్నసంతర్పణ కార్యక్రమం జరిగాయి.

కనుల పండువగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల

నకరికల్లు: రూపెనగుంట్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయ 52వ వార్షిక తిరునాళ్లను బుధవారం కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన ఏకాహం బుధవారంతో ముగిసింది. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు నారాయణం వెంకట కృష్ణమాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకొన్నారు. స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు. ఎస్‌ఐ పి.రాంబాబు బందోబస్తు నిర్వహించారు.